క్లుప్తంగా

అభయాంజనేయస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలి జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆలయానికి వెళ్లి, ఆంజనేయునికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా బాగుండాలని భగవంతుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, జేసీఎస్ పట్టణ, మండల ఇన్‌చార్జ్‌లు రేజేటి ఈశ్వరరావు(విసు), తమ్మిరెడ్డి దామోదరరావు, కౌన్సిలర్ కోట పెదరాములు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప క్రీడాకారులుగా ఎదగాలి



క్రీడాకారులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన వారంతా గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు ఆకాంక్షించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో జిల్లా స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు గొట్టాపు సాయి, సాయితేజలను ఎంపీడీవో పి.రవికుమార్‌తో కలిసి ఆయన అభినందించారు. కార్యక్రమంలో పీడీ వెంకటనాయుడు, కోచ్ అపర్ణబాబా, న్యాయవాది ప్రసాదరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: స్థానిక ఆర్టీసీ కొత్త కాంప్లెక్స్ నుంచి డోలపేటకు రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు గురువారం స్థలం పరిశీలించారు. కాంప్లెక్స్ వెనక నుంచి చెరువుగట్టు మీదుగా డోలపేట వరకు ప్రయాణికుల నడకదారి నిమిత్తం స్థలాన్ని చూశారు. గట్టును బాగుచేస్తే కొత్త రోడ్డుకు అవకాశం ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు నిర్మాణం, కావాల్సిన వ్యయంపై ఏఈ పి.వెంకట్‌తో అంచనాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



వీఆర్‌అగ్రహారం గ్రామంలో కొత్తగా వేసిన రోడ్డు

రాజాం: మండలంలోని వీఆర్‌అగ్రహారం గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. ప్రధాన రోడ్డులో గ్రామస్తులందరికీ ఉపయోగపడేలా ఈ రోడ్డును నిర్మించినట్లు సర్పంచ్ డబ్బాడ ఆదిలక్ష్మి తెలిపారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సలహాలు, సూచనల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మించామన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపడాలని ఆ దిశగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈవో త్రినాథరావు సూచించారు. మండలంలోని అప్పలంపేట ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించి, పాఠశాల రికార్డులు, విద్యార్థుల చేతిరాతను, హోమ్‌వర్క్ బుక్స్, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్‌లు, డైరీలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. నిర్ణీత సమయంలోగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరుకావాలన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి వార్షిక జాతర సందర్భంగా ఆలయానికి దర్శనం నిమిత్తం వచ్చే భక్తులకు విక్రయించే ప్రసాదం ధర పెంచామని ఆలయ ఈవో బి.వి.మాధవరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పులిహోర ప్యాకెట్ రూ.10, లడ్డూ రూ.15కు పెంచామన్నారు. పెంచిన ధరలపై అభ్యంతరాలుంటే ఆలయ పనివేళల్లో తెలియజేయాలన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



సన్మాన గ్రహీతలైన వలంటీర్లతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, జెడ్పీటీసీ సరస్వతి, తదితరులు

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వలంటీర్ల అభినందన సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, సేవావజ్ర అవార్డుకు ఎంపికైన వలంటీర్లు కాత్రగున సత్యవతి, బెల్లాన శ్యామలరావు, సేవారత్న అవార్డుకు ఎంపికైన వలంటీర్లు సింగారపు పరదీప్, బొద్దాన సంతోషి, పొట్టింగి లక్ష్మి, సామిరెడ్డి మహేష్, ఎ.రవికుమార్, సేవామిత్ర అవార్డుకు ఎంపికైన 284 మంది వలంటీర్లను సత్కరించి, అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన విప్లవం వలంటీర్ల వ్యవస్థ అన్నారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా లంచాలు దండుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తే.. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం వలంటీర్ల ద్వారా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. వలంటీర్లు నిస్వార్థ సేవకులని ప్రశంసించారు. ప్రజలకు సేవలు చేయడం మంచిపని అని, అలాంటి సేవలు అందిస్తున్న వలంటీర్లకు ఎంతైనా రుణపడి ఉంటామన్నారు. సీఎం జగన్ ప్రజాప్రతినిధుల కన్నా వలంటీర్లకు ఎక్కువ గౌరవం ఇస్తున్నారన్నారు. ప్రజలకు పథకాలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేయిస్తూ వారి కళ్లల్లో ఆనందాన్ని చూసే అదృష్టాన్ని వలంటీర్లకు జగనన్న కల్పించారన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం ఎన్ని మంచి కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ఎల్లోమీడియా, ప్రతిపక్ష పార్టీల నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. వారి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని ప్రతీ ఇంటికి వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు, జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, వైస్ ఎంపీపీలు బెల్లాన చంద్రశేఖర్, పెంకి శేఖర్, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, తహసీల్దార్ ఎ.సులోచనరాణి తదితరులు పాల్గొన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తూ గ్రామంలోని పేదలకు సేవలందించడం సంతృప్తిగా ఉంది. వలంటీర్‌గా అవకాశం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాను. నేను చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి, సేవారత్న అవార్డుతో సత్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

– బొద్దాన సంతోషి, వలంటీర్, రామభద్రపురం.

జగనన్నకు రుణపడి ఉంటాం..



ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా పనిచేస్తూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. నిరుద్యోగి అయిన నాకు వలంటీర్‌గా ఉపాధి కల్పించి, ఆర్థికంగా ఆదుకుంటున్న జగనన్నకు మా కుటుంబమంతా రుణపడి ఉంటాం. గ్రామంలోని ప్రజలకు సేవలు చేసే అవకాశం లభించడంతో పాటు ఎమ్మెల్యే శంబంగి చేతుల మీదుగా సేవావజ్ర అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది.

– బెల్లాన శ్యామలరావు, వలంటీర్, కొండకెంగువ గ్రామం.

వలంటీర్లు సంక్షేమ రథసారథులు



రేగిడి: వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రేగిడి: వలంటీర్లు సంక్షేమ రథసారథులని, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఒక్క రూపాయి అవినీతి లేకుండా పారదర్శకంగా అందిస్తున్న నిజమైన సేవకులు వలంటీర్లేనని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ప్రశంసించారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన వలంటీర్ల అభినందన సభకు ముఖ్య అతిథులుగా వారు హాజరై, సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో వలంటీర్లను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలకు తగ్గట్టుగా వలంటీర్లు సేవలు అందిస్తున్నారని, పార్టీలకతీతంగా, కుల, మతాలు చూడకుండా అర్హులైన ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వలంటీర్ వ్యవస్థ సేవలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గౌరవ వేతనంతో పాటు గ్రామాల్లో తగిన గుర్తింపు, గౌరవం కట్టబెట్టిన సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం చాలా మంచి కార్యక్రమమని, తమ జీవితంలో ఇదొక తియ్యని జ్ఞాపకంగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ అన్నారు. ప్రభుత్వం ఇటువంటి సత్కారాలు చేయడం వలంటీర్లకు మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వడమేనన్నారు. వలంటీర్లకు మంచి జీతాన్ని పొందే అవకాశం వస్తుందని, వలంటీర్లంతా ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు తెలియజేయాలని కోరారు. రాష్ట్రంలో కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలతో ఎంతో మంది ప్రాణాలు నిలిచాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, ఎంపీపీ డి.అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టి.అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వి.జగన్‌మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ యు.సురేష్, వంగర పార్టీ అధ్యక్షుడు కె.సుదర్శనరావు, ఎంపీడీవో శ్యామలాకుమారి, ఎంపీటీసీలు పి.గౌరునాయుడు, ఎ.అప్పలనాయుడు, సర్పంచ్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులుంటే గుర్తించండి



ఓటరు జాబితా జిరాక్స్ కాపీలను పంపిణీ చేస్తున్న జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్

బాడంగి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎన్నికల కమిషన్ కొత్తగా రూపొందించిన ఓటర్ల తుది జాబితా ప్రతులు(జిరాక్స్ కాపీ)ను జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ గురువారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 51 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు సంబంధించిన ఈ జాబితా జిరాక్స్ కాపీలను అన్ని గ్రామాలకు అందివ్వాలని పోలింగ్‌బూత్ కన్వీనర్లకు సూచించారు. ఓటరు జాబితాలో ఎవరి పేరు అయినా, వివరాలైనా తప్పుగా ఉంటే గుర్తించాలన్నారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు పొరపాటున జాబితాలో ఉన్నా, ఒకే వ్యక్తికి రెండుచోట్ల ఓటుహక్కు ఉన్నా గమనించాలన్నారు. మరో మూడు రోజులు మాత్రమే ఓటరు జాబితా మార్పులు, చేర్పులకు అవకాశం ఉన్నందున ఈ జాబితాను గ్రామాల్లోని అన్ని పార్టీల నాయకులకు అందివ్వాలన్నారు. అలాగే ప్రజలకు కూడా అందుబాటులో ఉండేలా వీటిని సచివాలయాల వద్ద ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి నాయుని వెంకటనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



అధికారులకు సూచనలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: వేసవికాలం నేపథ్యంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్వీమురళీ కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమావేశమైన ఆయన భోజరాజపురంలోని ప్రధాన తాగునీటి వనరుల కేంద్రం వద్ద ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లోని నీటి లభ్యతపై సమీక్షించారు. పాయలుగా ఉన్న నీటిని మళ్లించాలని సూచించారు. ఏఈ సురేష్ మాట్లాడుతూ ఇన్‌ఫిల్టరేషన్ బావి వద్ద కొద్దిపాటి పరిమాణంలో పైపు తుప్పు పట్టిందని ఆ పైపు భాగాన్ని కట్ చేసి, వెల్డింగ్ చేయాల్సి ఉందన్నారు. ప్రేమనగర్ కాలనీ వాసులు కాలనీలో మోటారు పాడయిందని చెప్పారని, వెంటనే ఆ మోటారు మరమ్మతులు చేయించాలని, ఈలోగా ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేయాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో విద్యుత్ మీటర్ల ఏర్పాటు



విద్యుత్ మీటర్లు ప్రారంభిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: పట్టణ పరిధిలోని కంచరాం గ్రామ సమీపంలో నిర్మించిన జగనన్న కాలనీలోని ఇళ్లకు కొత్తగా అమర్చిన విద్యుత్ మీటర్లను వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే సదుద్దేశ్యంతోనే ప్రభుత్వం ఇళ్లు, ఇళ్లపట్టాలు అందిస్తోందని, ఇక్కడి లబ్ధిదారుల ఇళ్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.80 లక్షల నిధులు ఇచ్చిందన్నారు. ఇక్కడి 1140 ఇళ్లకు విద్యుత్‌మీటర్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఇదే కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుకు వ్యతిరేకంగా నిరసన



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా మండలంలోని రంగరాయపురంలో రైతులు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం మాట్లాడుతూ రైతు సంక్షేమం పట్టని ప్రధాని నరేంద్ర మోదీ.. మద్దతు ధర కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న అన్నదాతలపై లాఠీచార్జ్, రబ్బరు బుల్లెట్లతో ఉక్కుపాదం మోపుతున్నారని విమర్శించారు. రైతులపై కేంద్రం చేస్తున్న దుర్మార్గపు చర్యలు మానుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలే బీజేపీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇకనైనా రైతులను అణచివేయాలన్న ఆలోచన మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, రైతు సంఘం నాయకులు ప్రసాద్, భూషణం, సాంబయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి అందజేత



గౌరీశ్వరికి ముఖ్యమంత్రి సహాయ నిధి సాయాన్ని అందజేస్తున్న పాలవలస రాజశేఖరం, తదితరులు

రేగిడి: మండలంలోని పెద్దలింగాలవలస గ్రామానికి చెందిన కొంకి గౌరీశ్వరికి రూ.2లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి సాయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్రపాలక మండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణరాజు గురువారం పాలకొండలో అందజేశారు. గౌరీశ్వరి భర్త రైలు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ పోషణ నిమిత్తం గౌరీశ్వరి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా విప్ విక్రాంత్ చొరవ చూపి సాయం అందేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, పంచాయతీ సర్పంచ్ బోరజాన అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రాజాం సిటీ: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడంతో పాటు సమాజంలో పేరుప్రతిష్టలు సంపాదించాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు దీటుగా పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వప్న హైందవి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: మండల పరిధిలోని మొగిలివలస విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలగనుందని ఏఈ ఓజేసీఏ కుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డుతో పాటు పాలకొండ రోడ్డు, బుచ్చెంపేట, గురవాం, పొనుగుటివలస ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

ఉద్యోగుల సర్దుబాటుకు చర్యలు

బాడంగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల్లో ఉద్యోగుల సర్దుబాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత ప్రక్రియ ఆన్‌లైన్‌లో గురువారం ప్రారంభం కాగా మండల వ్యాప్తంగా ఉన్న 18 గ్రామ సచివాలయాల్లో ఏ సచివాలయంలో ఎంత మంది పనిచేస్తున్నారన్న దానిపై సమాచారం సేకరిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో 11 మంది సిబ్బంది చొప్పున ఉండాల్సి ఉండగా, కొన్ని సచివాలయాల్లో నెలకొన్న తక్కువ సిబ్బందితో కొన్ని ప్రజోపయోగకరమైన పనులు సక్రమంగా జరగడం లేదు. దీనికి ప్రధాన కారణం సిబ్బంది కొరతగా భావించిన ప్రభుత్వం ప్రతీ సచివాలయంలో కనీసం ఎనిమిది మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఉద్యోగుల సంఖ్యకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తున్నారు.

కృష్ణ మాస్టారు సేవలు శ్లాఘనీయం

- ఏగిరెడ్డి కృష్ణ మాస్టారి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఉద్దవోలులో కృష్ణ మాస్టారి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామ అభివృద్ధికి, ప్రజల అభ్యున్నతికి మాజీ సర్పంచ్, దివంగత ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ మాస్టారు చేసిన సేవలు శ్లాఘనీయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో గురువారం జరిగిన కృష్ణ మాస్టారి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, కృష్ణ మాస్టారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఆ పార్టీ, ఈ పార్టీ అని చూడకుండా గ్రామ అభివృద్ధికి అవసరమైన ఏ పని కావాలన్నా ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి, ఆ పని పూర్తి చేసుకుని వచ్చేవారన్నారు. కృష్ణ మాస్టారితో ఎన్నో ఏళ్లుగా తనకు మంచి అనుబంధం ఉండేదన్నారు. ఆయన మరణాన్ని ఏ ఒక్కరూ జీర్ణించుకోలేరని, ఆయన ఆశయ సాధనకు తనవంతు కృషి చేస్తానని, ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు.

గొప్ప వ్యక్తులకే విగ్రహాలు పెడతారని, 40 ఏళ్లుగా గ్రామ అభివృద్ధికి పాటుపడిన కృష్ణ మాస్టారి విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, డీసీసీబీ డైరెక్టర్, సర్పంచ్ ఎచ్చెర్ల సునీత విజయప్రసాద్, కృష్ణ మాస్టారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఉపాధి పనులు



రేగిడి: పెద్దశిర్లాంలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. మండలంలోని ఏవీపురం పెద్దశిర్లాం, చిన్నశిర్లాం గ్రామాల్లో జరుగుతున్న పనులను ఏపీవో ఎస్.హరనాథరావు గురువారం పరిశీలించి, కాసేపు మాట్లాడారు. ఏ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు లేకుండా ఉండాలనే సదుద్దేశ్యంతోనే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించడం జరుగుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని, నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయిస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని జి.ఎస్.పురంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో హరనాథరావు గురువారం పరిశీలించారు. అనంతరం వేతనదారుల మస్టర్లు పరిశీలించి, పనిలోకి వచ్చిన వారికి మాత్రమే మస్టర్లు వేయాలని సూచించారు. కొలతల ప్రకారం పనిచేయాలని, అలా అయితే రూ.272 కనీస వేతనం లభిస్తుందన్నారు.

పక్కాగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పరిస్థితులపై స్థానికులను ఆరాతీస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణ పరిశుభ్రతే లక్ష్యంగా పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని అప్పయ్యపేట, సాలావారి తోట, మహారాణిపేట, ఫూల్‌భాగ్ ప్రాంతాల్లో ఆమె గురువారం పర్యటించి, అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. అప్పయ్యపేట, ఫూల్‌భాగ్ ప్రాంతాల్లో పేరుకుపోయిన పూడికలు, చెత్త తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇక్కడి 31 వార్డుల్లోనూ పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు. ఆమె వెంట ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సోమేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తంగా...

సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని మందరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థులు గ్రామంలోని సచివాలయాన్ని గురువారం సందర్శించారు. సాంఘికశాస్త్రంలోని సచివాలయ వ్యవస్థ అనే పాఠ్యాంశంలో భాగంగా సోషల్ టీచర్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు సచివాలయానికి వెళ్లి, అక్కడి ప్రజలకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. సిబ్బంది సైతం సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న అన్నిరకాల సేవలను విద్యార్థులకు తెలియజేశారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

బాడంగి: మండలంలోని డొంకినివలస గ్రామంలో ఈవీఎంల వినియోగం ద్వారా ఓటు వేయడంపై గురువారం అవగాహన కల్పించారు. ఈవీఎంలు కలిగిన వ్యాన్‌తో గ్రామ సచివాలయం వద్దకు వెళ్లిన, సిబ్బంది ఈవీఎం ఆధారంగా ఓటు వేయడాన్ని ప్రదర్శించి, చూపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు చేరుకోవాలి

రేగిడి: ప్రభుత్వ లక్ష్యాలను ఉపాధ్యాయులు చేరుకోవాలని, విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. గురువారం స్థానిక మండల రిసోర్సు కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన లెర్న్ ఏ వర్డ్ సిలబస్ పూర్తి చేయాలని, ఎండీఎఫ్ బాక్సులు, ఎసిరిలిక్ బోర్డులు అందరికీ కనిపించేలా పాఠశాలల్లో ప్రదర్శించాలని తెలిపారు. నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యాబోధన అనుబంధ యాప్‌లను స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసి, సకాలంలో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో ఎంఈవో–2 బి.ఎరకయ్య పాల్గొన్నారు.

24న మందకృష్ణ మాదిగ రాక

బొబ్బిలి: పట్టణానికి ఈ నెల 24వ తేదీన ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఇక్కడి గంటి ప్రసాదం స్మారక భవనంలో నిర్వహించే ప్రజాచైతన్య సభలో పాల్గొని, మాదిగ, మాదిగ ఉపకులాల హక్కులు, సంక్షేమం, రిజర్వేషన్ల సాధనపై ప్రసంగించనున్నారన్నారు. సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పి.విజయరామారావు, కె.సురేంద్ర, కె.రాము పాల్గొన్నారు.

వేలంపాటకు స్పందన కరువు

బొబ్బిలి: స్థానిక మార్కెట్ ఆశీలు వేలంపాటకు స్పందన కరువైంది. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సమక్షంలో గురువారం వేలం నిర్వహించగా, వేలంపాట పాడేందుకు ఏ ఒక్కరూ ముందుకురాలేదు. ప్రభుత్వ వేలంపాటను రూ.10.80 లక్షలకు ప్రారంభించగా, వేలం దక్కించుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో బాక్స్ టెండర్ ద్వారా వేలం ఖరారు చేయాలని నిర్ణయించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఆర్‌సీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు గురువారం పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో సౌకర్యాలపై ఆరాతీశారు. ర్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు నేమ్ బోర్డులు సక్రమంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.